మద్యం షాపులకు దరఖాస్తు గడువు పెంపు

పార్వతీపురం-ఆంధ్రజ్యోతి/విజయనగరం క్రైం, అక్టోబరు 9: రాష్ట్ర ప్రభుత్వ నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆహ్వానించిన దరఖాస్తుల గడువును పెంచింది. ఈ నెల 9వ తేదీతో గడువు ముగియనుండగా తిరిగి ఈ నెల 11న సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 14న లాటరీ పద్ధతితో మద్యం షాపులను కేటాయించనుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అబ్కారీశాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యం భద్రమేనా?

- ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో భిన్న పరిస్థితులు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఆరోగ్య కార్యకర్తల తొలగింపు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- అనారోగ్య సమస్యలతో మృత్యువాతపడుతున్న విద్యార్థులు
- నూతన ప్రభుత్వం స్పందించాలని జిల్లావాసుల విన్నపం



ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

(కొమరాడ)

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణ మృదంగం కొనసాగుతూనే ఉంది. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యనభ్యసిస్తున్న వారు అనారోగ్య సమస్యలతో మృత్యువాతపడడం జిల్లావాసులను కలవరపరుస్తోంది. ఇటీవల కాలంలో చోటుచేసుకున్న వరుస సంఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళన కలిగిస్తున్నాయి. బాగా చదివి ఇంటికి తిరిగొస్తారనుకుంటున్న వారి పిల్లలు విగతజీవులుగా మారడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఏదేమైనా పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గిరిజన విద్యార్థులు ఆరోగ్య సమస్యలతో మరణించడం అందర్నీ కలిచివేస్తోంది. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించాలని 'మన్యం'వాసులు కోరుతున్నారు.

వరుస ఘటనలు..

- ఈ నెల 1న కొమరాడ కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న కద్రక శారద డెంగ్యూ జ్వరంతో మృతి చెందింది.
- ఈ నెల 3న గుమ్మలక్ష్మీపురం మండలం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అవంతి కూడా డెంగ్యూ జ్వరంతో మృతి చెందింది. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు గిరిజన విద్యార్థినులు అనారోగ్యంతో మృతి చెందడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- ఈ ఏడాది మార్చి 8న కొమరాడ మండలం కెమిశీల ఆశ్రమ పాఠశాల విద్యార్థి జ్వరంతో మృతి చెందాడు.
- అదే నెల 10న ఎండభద్ర ఆశ్రమ పాఠశాల విద్యార్థి సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతూ మృతి చెందాడు.

..ఇలా ఐటీడీఏ పరిధిలో ఏటా విద్యార్థులు అనారోగ్యంతో మృత్యువాత పడుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గిరిజన విద్యార్థుల ఆరోగ్య విషయంలో అధికారులు శ్రద్ధ చూపకపోవడంపై ప్రజా సంఘాలు మండిపడుతున్నారు. వాస్తవంగా వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యానికి గురైతే.. హెచ్ఎం లేదా వార్డెన్ వారిని సకాలంలో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలి. కానీ చాలాచోట్ల అలా జరగడం లేదనే విమర్శలున్నాయి. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయలేకపోవడం, ఆసుపత్రికి తీసుకెళ్లడంలో జాప్యం జరగడం, పాఠశాలల్లో అందుబాటులో ఉన్న మందులను వినియోగించడం వల్ల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు విషమిస్తున్నాయి. మరికొన్నిచోట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కూడా గిరిజన విద్యార్థుల మృత్యువాతకు కారణమనే ఆరోపణలున్నాయి.

మౌలిక వసతులేవీ?

పార్వతీపురం-ఆంధ్రజ్యోతి: జిల్లాలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో మౌలిక వసతులు లేవు. చాలాచోట్ల ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు. దోమ తెరలు కూడా సరిపడినన్ని లేవు. విద్యార్థులు చదువుకునేందుకు ప్రత్యేక రీడింగ్ రూమ్, భోజనాల కోసం డైనింగ్ రూమ్‌లు లేవు. ఇరుకైన గదుల్లోనే వారు ఉండాల్సి వస్తోంది. గుమ్మ లక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ, సీతంపేట మండలాల్లో గిరిజన, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 23 పోస్టుమెట్రిక్ హాస్టళ్లు ఉండగా, వాటిల్లో సుమారు రెండు వేల మందికి పై బడి విద్యార్థులు ఉంటున్నారు. కాగా హాస్టళ్లకు సొంత భవనాలు లేవు. దీంతో ప్రైవేట్ భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. అయితే ఆయా వసతిగృహాలకు సరైన తలుపులు, కిటికీలు లేకపోవడం, మరుగుదొడ్లు, బాత్‌రూములు, గదులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.



జిల్లా కేంద్రంలో పోస్టుమెట్రిక్ వసతిగృహం ఇలా...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించారు. వారు గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకునేవారు. వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించేవారు. జాగ్రత్తలపై అవగాహన కల్పించేవారు.

వైసీపీ పాలనలో..

గత వైసీపీ ప్రభుత్వం కూడా వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన ఏఎన్ఎంలను వైసీపీ సర్కారు తొలగించింది. అప్పటి నుంచి ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితి దారుణంగా మారింది. గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు.



సీతంపేట రూరల్: మల్లి ఆశ్రమ పాఠశాలలో..

ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడం వల్లే..

జిల్లాలో సుమారు 75 ఆశ్రమ పాఠశాలు, వసతి గృహాలు, గురుకులాల్లో 17 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించేందుకు ఆరోగ్య కార్యకర్త (ఏఎన్ఎం)లను నియమించేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడమే విద్యార్థుల మృత్యువాతకు కారణమని వారు భావిస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

విచారణ చేపట్టాలి..

జిల్లాలో విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలి. వసతి గృహాల నిర్వాహకుల నిర్లక్ష్యమా లేక వైద్యుల అలసత్వమా అన్నది విచారణలో తేల్చి బాధ్యులపై చర్యలు చేపట్టాలి.

-కొల్లి సాంబమూర్తి, సీపీఎం నాయకుడు, కొమరాడ

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ..

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం.. దసరా సెలవుల అనంతరం వారికి స్ర్కీనింగ్ టెస్టులు నిర్వహించాలని ఇప్పటికే పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించాం. జ్వర లక్షణాలతో ఉన్నవారికి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు జరిపించాలని, రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి పీహెచ్‌సీల్లో తగిన చికిత్స అందించాలని సూచించాం. మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేయాలని తెలియజేశాం.

-విజయపార్వతి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, పార్వతీపురం మన్యం

గంజాయి రవాణాపై నిఘా

- జూమ్ మీటింగ్‌లో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



బెలగాం, అక్టోబరు 9: గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని, నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఎస్పీలను ఆదేశించారు. బుధవారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'పేకాట స్థావరాలను గుర్తించాలి. జూదం, క్రికెట్ బెట్టింగ్ జరగకుండా చూడాలి. బాణాసంచా విక్రయించే గొడౌన్లు, దుకాణాల లైసెన్స్‌లు తనిఖీ చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలి. నేరాల నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి. పెండింగ్ కేసులను త్వరగా దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలి. అదృశ్యం కేసుల్లో బాలుర, బాలికల ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.' అని ఆయన సూచిం చారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీలు మాధవరెడ్డి, దీపిక, అమిత్ బర్దర్, వకుల్ జిందాల్, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


16 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

విజయనగరం, కలెక్టరేట్, అక్టోబరు 9: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధమవుతోంది. అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఈనెల 16న ప్రారంభించి నవంబరు 24వ తేదీ వరకూ వివిధ దశల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. గతంలో టీడీపీ హయంలో ఎన్నికలు జరిగాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికలపై దృష్టిపెట్టలేదు. కాగా విజయనగరం డివిజన్‌లో 267 సంఘాలకు, పార్వతీపురం డివిజన్(బొబ్బిలి సబ్ డివిజన్)లో 30, శ్రీకాకుళం డివిజన్ (పాలకొండ సబ్ డివిజన్)లో 75, మడ్డువలస రిజర్వాయర్ పరిధిలో 15 మొత్తం 387 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటి పరిధిలో 2,628 టీసీలు ఉన్నాయి.

గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా..

- 14 నుంచి జిల్లాలో 'పల్లె పండగ'
- ఆదేశాలిచ్చిన ప్రభుత్వం
- రూ.60 కోట్లతో పనులకు శ్రీకారం

మక్కువ: శంబర గ్రామం



(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 14 నుంచి 'పల్లె పండగ' ప్రారంభం కానుంది. గ్రామసభలో ఆమోదం పొందిన అభివృద్ధి పనులు చేపట్టేం దుకు యంత్రాంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పల్లె పండగలో భాగంగా పలు గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజలు చేయనున్నారు. ఈ నెల 21 వరకు ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్‌తో పాటు 15వ ఆర్థిక సంఘం, గిరిజన ఉప ప్రణాళిక నిధు లను ఈ నిర్మాణాలకు కేటాయించనున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సుమారు రూ.60 కోట్లతో పనులు చేపట్టేందుకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిపాలనా పరమైన ఆమోదం తెలిపారు. పంచాయతీరాజ్ తదితర ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో సుమారు 303 పనులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులకు కూడా మోక్షం కలగనుంది. ఇందుకోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే 'మన్యం'లో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారుల మరమ్మతులు చేపట్టనున్నారు.

మౌలిక వసతులకే పెద్దపీట

వాస్తవంగా గత వైసీపీ సర్కారు హయాంలో గ్రామ పంచాయతీలు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. నాడు విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించింది. దీంతో పంచాయతీల ఖాతాల్లో నిధులు లేక అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి. అంతేకాదు పారిశుద్ధ్యం, వీధిలైట్లు, రోడ్లు, కాలువల సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోలేదు. సర్పంచ్‌లతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లా మారారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పల్లెలపై దృష్టి సారించింది. పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగానే 'పల్లె పండగ' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. దీని ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించింది. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని అధికారులకు సూచించింది. మొత్తంగా కూటమి సర్కారు చర్యలతో గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టనుంది.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా

ఎదగాలి: కలెక్టర్



పార్వతీపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి)/ బెలగాం: జిల్లాలో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలన్నారు. జిల్లాలో జీవనోపాధి కార్యక్రమాలపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పీఎంఈజీపీ(ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) ద్వారా జిల్లాలో కొత్త యూనిట్ల స్థాపనకు అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు కావల్సిన శిక్షణ కూడా ఇప్పించాలని సూచించారు. ఐటీడీఏలో జీవనోపాధుల సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాని ఆదేశించారు. యూనిట్ స్థాపనలో ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం, ఇతరులకు 15 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన కింద దరఖాస్తులు చేసుకున్న చేతివృత్తుల వారికి తగిన శిక్షణ ఇచ్చి రూ.15 వేలు విలువ గల కిట్‌తో పాటు కొత్త యూనిట్ల స్థాపనకు రుణం మంజూరు చేస్తారని తెలిపారు. పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18,19 తేదీల్లో 500 కుటుంబా లకు గొర్రెలు పంపిణీ చేయాలన్నారు. నవంబరు ఒకటో తేదీ నాటికి ప్రతి మండలంలో ఒక మోడల్ వీడీవీకే తయారు చేయాలని ఆదేశించారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు

జిల్లాలో మలేరియా, డెంగ్యూ నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యశాఖాధికారులతో మాట్లాడుతూ.. 'డెంగ్యూ, మలేరియా కేసులు పెరగకుండా చూడాలి.. పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి. సీజనల్ వ్యాధులు, పారిశుధ్యంపై ప్రజ లకు అవగాహన కల్పించాలి. జిల్లాలో సికిల్‌సెల్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలి. 10-19 ఏళ్ల లోపు ఆడపిల్లలు, గర్భిణులకు తప్పనిసరిగా ఎనీమియా పరీక్షలు నిర్వహించాలి. మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలి. ప్రైవేట్ ఆసుప త్రుల్లో సేవలపై కమిటీని నియమించి తనిఖీలు చేయాలి.' అని ఆయన తెలిపారు.

సరస్వతీ నమస్తుభ్యం

- చదువుల తల్లి అలంకరణలో అమ్మవార్లు
- అంతటా సామూహిక అక్షరాభ్యాసాలు



సాలూరులో పూజలందుకున్న జ్ఞాన సరస్వతి

పాలకొండ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ బుధవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీప్రసాదశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. చిన్నారులు, విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న వారికి దేవాలయ సిబ్బంది పెన్ను, పుస్తకాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ, అర్చకులు వేమకోటి మణిశర్మ, ప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.

సంబరాల సందడి

పట్టణంలో పలు వీధుల్లో బుధవారం సంబరాలు బుధవారం జరిపారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతవాసులు ఘటాలతో ఊరేగింపుగా కోటదుర్గమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సంబరాల్లో అమ్మవారి వేషధారణాలు, కోలాటాలు, డప్పువాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు అమ్మవారిని దర్శించుకోవడానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో క్యూలైన్లన్నీ కిక్కిరిశాయి. డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి బందోబస్తు నిర్వహించారు.

సాలూరులో..

సాలూరు రూరల్: మూలనక్షత్రం సందర్భంగా పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వేంచేసిన జ్ఞాన సరస్వతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన తల్లిదండ్రులు తమ చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఇదిలా ఉండగా సాలూరుకు చెందిన కోట నాగరాజు, గవరరాజు దంపతులు జ్ఞాన సరస్వతి అమ్మవారికి రూ.1.30 లక్షల విలువైన బంగారు మంగళసూత్రాలను అందించారు.



సరస్వతీ దేవిగా కోటదుర్గమ్మ



జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం



ముర్రాటలతో కోటదుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు



కొత్త ఏడాదిలో సెట్స్‌పైకి



మహేశ్‌బాబు- రాజమౌళి కలయికలో వస్తున్న చిత్రం (ఎస్ఎస్ ఎంబీ 29-వర్కింగ్ టైటిల్). భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొన్న నేపథ్యంలో దీనిపై అప్డేట్ వచ్చింది. వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రం షూటింగ్ మొదలవనుంది. ఈ విషయాన్ని రచయిత విజయేంద్రప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సినిమాకు కథ రాయడానికి దాదాపు రెండేళ్లు పట్టిందని ఆయన తెలిపారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించనున్నారని విజయేంద్ర ప్రసాద్ చెప్పారు. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు ఇప్పటికే కొత్త లుక్‌తో సిద్ధమయ్యారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో అడ్వంచరస్ యాక్షన్ మూవీగా తెరకెక్కనుంది. కేఎల్ నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది.

అందుకే ఈ టైటిల్



రజనీకాంత్ నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్ర బృందం నిర్వహించిన మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దిల్‌రాజు మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్ విషయంలో ట్రోలింగ్స్ వస్తుండడం చూశా. సాధ్యమైనంత వరకూ టైటిల్స్‌ను స్థానిక భాషలోనే పెడుతున్నారు. సినిమాను సినిమాగా చూడండి" అని చెప్పారు. 'తెలుగు ప్రేక్షకులంతా 'వేట్టయాన్'ను చూసి విజయవంతం చేయండి" అని నిర్మాత సురేశ్‌బాబు కోరారు.

గేమ్ చేంజర్ విషయంలో అదే జరిగింది : దిల్‌రాజు

"గేమ్ చేంజర్‌కి డైరెక్టర్ టైటిల్ చెప్పినప్పుడు.. ఆ టైటిల్‌ను అన్ని భాషల్లో చెక్ చేశాం. పాన్ ఇండియా సినిమాకు టైటిల్ పెడితే అన్ని భాషల్లోకి అదే టైటిల్‌తో వెళ్లాలి. మనం అనుకునే పాన్ ఇండియా టైటిల్‌ను వేరే భాషల్లో రిజిస్టర్ చేసి ఉంటే చాలా సమస్య అవుతుంది. గేమ్ చేంజర్ విషయంలో అదే జరిగింది. ఈ టైటిల్ కోసం మళ్లీ అందరితో మాట్లాడి.. ఒప్పించి అప్పుడు అన్ని భాషల్లో ఒకేలా ఉండే టైటిల్‌ను ప్రకటించాం. పాన్ ఇండియాకు టైటిల్ పెట్టడం అంత సులభం కాదు" అని దిల్‌రాజు అన్నారు..

పక్కా పండగ సినిమా



గోపీచంద్ నటించిన మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో టీజీ. విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను గోపీచంద్ మీడియాతో పంచుకున్నారు.

"పక్కా పండగ సినిమా ఇది. థియేటర్లు ప్రేక్షకుల నవ్వుల్తో నిండిపోతాయి. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదానికంటే రెండింతలు బాగా వచ్చింది. ఒక్క సెకండ్ కూడా బోర్ కొట్టకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. దేశం ఎదుర్కొంటున్న ఓ కీలక సమస్యను ఇందులో చూపించాం. అదేంటన్నది థియేటర్లలోనే చూడాలి. శ్రీనువైట్లకు ఇది కమ్‌బ్యాక్ ఫిల్మ్ అవుతుంది. ఆయన టైమింగ్‌ను అందుకోవడానికి నాకు రెండు రోజులు పట్టింది. నా సినిమాల్లో.. 'లౌక్యం' తర్వాత ఆ స్థాయి వినోదం ఇందులోనే ఉంది. సినిమాలో నా పాత్ర పేరు 'విశ్వం'. ప్రతీ పాత్రకూ ప్రాధాన్యం ఉంటుంది. యాక్షన్, కామెడీ, సెంటిమెంట్, ఎమోషన్స్.. ఇలా అన్నీ చక్కగా కుదిరాయి. కావ్యథాపర్ పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. చేతన్ భరద్వాజ్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఇందులో ఉన్న ట్రైన్ ఎపిసోడ్ గురించే అందరూ మాట్లాడుతున్నారు. 'వెంకీ' సినిమాలోని ట్రైన్ ఎపిసోడ్ ఎంత వినోదాన్ని ఇచ్చిందో.. ఇందులో అంతకు మించిన వినోదం పండుతుంది. ప్రొడ్యూసర్లు రాజీపడకుండా నిర్మించారు" అని చెప్పారు.

ఆ పంజాబీ అమ్మాయి ఎవరు?



నటి పూనమ్‌కౌర్, బుధవారం ఎక్స్ వేదికగా ఓ సంచలన ట్వీట్ చేశారు. "చిత్రపరిశ్రమలోని ఓ దర్శకుడు ఓ పంజాబీ నటిని గర్భవతిని చేశాడు. అబార్షన్ చేయించి ఆ అమ్మాయి కెరీర్‌ను సర్వనాశనం చేశాడు. అయితే ఆ వ్యక్తి.. రాజకీయ నాయకుడిగా మారిన నటుడు కాదు. ఓ దర్శకుడు. 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) తోడ్పాటుతో ఆ పంజాబీ అమ్మాయికి కాస్త సహాయం లభించింది. ఈ విషయంలోకి నన్ను, రాజకీయనాయకుడిగా మారిన ఓ నటుడ్ని అనవసరంగా లాగారు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. దాగుడు మూతలు ఆపి ఆ పంజాబీ అమ్మాయి పేరు బయట పెట్టాలంటూ నెటిజన్లు పూనమ్‌కౌర్‌ను ట్రోల్ చేస్తున్నారు. గతంలో దర్శకుడు త్రివిక్రమ్‌పై తను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌లో ఫిర్యాదు చేశానని, కానీ వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇటీవలే పూనమ్ వెల్లడించారు.

అద్భుతమైన కథతో...



సంయుక్త లీడ్‌రోల్‌లో ఓ చిత్రం ప్రారంభమైంది. యోగేశ్ కే.ఎం.సీ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ "కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటిస్తాం" అని చెప్పారు. "ఈ సినిమా కథ అద్భుతంగా ఉంటుంది. ఇటువంటి స్క్రిప్ట్‌లో భాగం అయినందుకు అదృష్టంగా భావిస్తున్నాను" అని సంయుక్త మీనన్ అన్నారు. "ఇందులో యాక్షన్ ఘట్టాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని" అని దర్శకుడు యోగేశ్ తెలిపారు.







లింగ వివక్ష తొలగించేందుకు అవగాహన

విజయనగరం రింగురోడ్డు: లింగ వివక్ష, అసమానతలను తొలగించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కరరావు అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో లింగవివక్షత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టరు కె.రాణి, నోడల్ అధికారి ఆర్ అచ్యుతాకుమారి, డాక్టరు ఎస్ సూర్యనారాయణ, విద్యాశాఖాధికారులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

సహ చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి

జామి: ప్రభుత్వ కార్యాలయాల్లో సహచట్టం బోర్డులు ఏర్పాటుచేయాలని చట్టం జిల్లా సమన్వయకమిటీ సభ్యుడు దొడ్డి సూర్యారావు కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఇతర కార్యాలయం అధికారులను కలిసి బోర్డులు ఏర్పాటుచేయాలని కోరారు.

కొత్తపేటలో దీపారాధన

విజయనగరం రూరల్: దుర్గానవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేట, యాదవవీధి, బంగారమ్మ చదును వద్ద బుధవారం దీపారాధన కార్యక్రమం జరిగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం నాడు దీపారాధన కార్యక్ర మం నిర్వహించారు. గురువారం ఉదయం దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేకంగా హోమం కార్యక్రమం నిర్వహించనున్నారు.

14 నుంచి అప్రెంటీషిప్ మేళా

దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14 నుంచి ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టీవీ గిరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పాసైన వారు ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. మైలాన్ లేబరేటరీస్, వరుణ్ మోటార్స్, జైబేరి ఆటోమోటివ్, ఆర్వీ మోటార్స్, అరబిందో ఫార్మా, హెట్రో డ్రగ్స్ ఆంధ్ర కెమికల్, కళా ఫుడ్‌ప్రొడక్ట్స్ తదితర ప్రముఖ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 98491 18075, 98499 44654 నెంబర్లుకు సంప్రదించాలన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

విజయనగరం టౌన్: ప్రతి విద్యార్థి జీవితంలో ఎన్‌సీసీ అంతర్ భాగం కావాలని, ఎన్‌సీసీతో మంచి నడవడిక, క్రమశిక్షణ అలవడుతుందని ఉమ్మడి రాష్ట్ర ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమేండర్ వి.ఎం.రెడ్డి అన్నారు. జిల్లాలోని కోరుకొండ సైనిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సీసీ, దేశ రక్షణ రంగంలో ప్రవేశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో జరుగుతున్న శిక్షణ, ఎన్‌సీసీ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి ఆయనకు జ్ఞాపికకు అందజేశారు. పాఠశాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి భీమసింగి కార్మికుల సమస్య

జామి: మండలంలోని భీమసింగి షుగర్స్‌కు చెందిన 20 మంది కార్మికులు తమకు రావాల్సిన సెటిల్‌మెంట్ నగదు ఐదేళ్లుగా అందడం లేదని, దీనిని పరిష్కరించాలని కోరుతూ సుగర్స్ రిటైర్డ్ ఉద్యోగులు బీశెట్టి ఆదిబాబు, ఉంగరాల శ్రీను, రాంబాబు, వెంకటరావు, అబ్బాస్ తదితరులు జిల్లా మంత్రి శ్రీనువాస్‌ను బుధవారం కలిశారు. స్పందించిన మంత్రి ఈవిషయం వెంటనే సంబందిత ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మారిక రోడ్డు కోసం ఆందోళన చేస్తాం

వేపాడ: మండలంలోని మారిక గ్రామానికి రహదారి నిర్మించాలని ఏళ్లగా ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించడంలేదని, దీనిపై త్వరలో వేపాడ ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి గిరిజనులు సిద్ధంగా ఉండాలని జిల్లా సీపీఎం నాయకుడు చల్లా జగన్ పిలుపునిచ్చారు. మంగళవారం, బుధవారం గ్రామాల్లో పర్యటించిన ఆయన గిరిజనులతో మారికలో నిరసన చేపట్టారు. గ్రామ రహదారి, గ్రామ సమస్యలను 20 రోజుల్లో పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించి వంటావార్పుతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా పార్టీ నాయకులు జి.అప్పారావు, పార్టీ కార్యదర్శి గమ్మెల బాబూరావు, అప్పలనాయుడు, ఆశు, అర్జున్, గిరిజనులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

రేగిడి: వైద్యసిబ్బంది రోగులకు మెరుగైన వైద్యసేవలతో పాటు, బాధ్యతగా పనిచేయాలని వైస్ఎంపీపీలు అచ్చంనాయుడు, జగన్మోహనరావు బూరాడ పీహెచ్‌సీ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మండలంలో బూరాడ పీహెచ్‌సీలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దార అప్పలనరసమ్మ కాగా ఆమె గైర్హజరుకాగా, వైస్ఎంపీపీలు టెంకాల అచ్చంనాయుడు, వి.జగన్మోహనరావుల ఆధ్వర్యంలో చర్చ జరిపారు. వైద్యాధికార్లు డా. చలమయ్య, మరోవైద్యురాలు రీనాచౌదరి సమక్షంలో ఆసుపత్రి సేవలు, సిబ్బంది పనితీరుతో పాటు, ఆసుపత్రికి ఉండాల్సిన మౌలికసౌకర్యాలు చర్చించారు. కమిటీ సభ్యురాలు తాటిపాడు సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీహెచ్ఈవో రాధాకృష్ణ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుమ్యాన్‌లకు సత్కారం

బొబ్బిలి: ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టుమ్యాన్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెడ్ పోస్టుమాస్టర్ గంట రాధ మాట్లాడుతూ తపాలా శాఖలో నేటి ఆధునిక సమాజానికి కావాల్సిన సేవలను విస్తృతంగా అందిస్తున్నట్లు తెలిపారు. కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు పట్టణ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోస్టుమ్యాన్‌లను సత్కరించి బహుమతులను అందజేశారు.

ఆరికతోటలో అన్నదానం

రామభద్రపురం: మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాతకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం పూజలు నిర్వహించారు. దుర్గామాతను సరస్వతీదేవిగా అలంకరించి విద్యార్థులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం బేబీనాయన చేతులమీదుగా అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, పల్లా చంద్రరావు, నల్ల కూర్మారావు, సంగిరెడ్డి ప్రసాదరావు, జేత స్వామినాయుడు, కనకల తవుడు, పూసర్ల బోసు, కూనిశెట్టి భాస్కరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

బొబ్బిలి రూరల్: విజయవాడ ప్రాంతంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు నందబలగ గ్రామ టీడీపీ నాయకులు, ప్రజలు కలిసి తమవంతుగా రూ.21,000, బొబ్బిలి పట్టణం 25వ వార్డు కౌన్సిలర్ కళ్యంపూడి లక్ష్మి, కళ్యంపూడి సత్యనారాయణ తమవంతుగా రూ. 20,000, పిన్నవలస వాస్తవ్యులు సత్యం మాష్టారు తమవంతుగా రూ. 6,000, ఆనందో బ్రహ్మ గ్రూప్ సభ్యులు మింది విజయమోహనరావు, చప్ప అప్పలనాయుడు, కె ఉమ, కమల తమవంతుగా రూ.10,000 ఎమ్మెల్యే బేబీనాయనకు అందించారు.

మనోబలం.. విజయసోపానం

మనిషి జీవితం యాంత్రికంగా మారిపోయింది. క్షణం తీరక లేకుండా గడుపుతున్న తరుణంలో ఒత్తిడి తట్టుకోలేక చాలా మంది మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. వాటి నుంచి బయటపడలేక జీవితానికి నష్టం కలిగించుకుంటున్నారు. వ్యాయామం, పౌష్టికాహారంతో మానసిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అక్టోబరు 10 ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

-విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ బొబ్బిలి

- మనసును అదుపు చేయగలిగితే అన్నీ విజయాలే
- సమాజంలో పెరుగుతున్న మానసిక రుగ్మతలు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



● జనవరి 12న గుర్ల మండలం కోటగండ్రేడు గ్రామంలో ఓ మహిళను భర్త సత్యం దారుణంగా హత్య చేశాడు. మద్యం తాగవద్దని భార్య అన్నందుకు కోపోద్రిక్తుడై కర్రతో బలంగా కొట్టాడు. దీంతో ఆమె ఘటనాస్థలంలోనే కుప్పకూలింది. అక్కడికి కొద్దిరోజులుగా సత్యం మానసిక స్థితి బాగాలేదని స్థానికులు తెలిపారు.

● రెండు నెలల కిందట రామభద్రాపురం మండలం ముచ్చర్లవలసలో వారం వ్యవధిలో తండ్రీకొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముందుగా కుమారుడు నడగాన సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు మరణాన్ని తట్టుకోలేక తండ్రి రమణ కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేవలం మానసిక స్థితి సరిగా లేకే రమణ ఆ నిర్ణయం తీసుకున్నట్టు స్థానికులు అభిప్రాయపడ్డారు.

మనిషి శారీకంగా ఎంత ఆరోగ్యంగా ఉన్నా.. మానసికంగా ప్రశాంతత లోపిస్తే మాత్రం ఎన్నో అనర్థాలకు కారణమవుతుంది. జీవితం లయ తప్పుతుంది. పొరపాట్లకు అవకాశం ఇస్తుంది. దీర్ఘకాలిక రుగ్మతలకు దారితీస్తుంది. విపరీతమైన ఆలోచనలు ఆత్మహత్యలకు పురిగొలుపుతాయి. కరోనా తరువాత మనిషి విపరీతమైన మానసిక రుగ్మతలకు గురవుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనంలో తేలింది. సరైన అవగాహన కల్పించాలని, మెరుగైన చికిత్స అందించాలని అన్ని దేశాలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. సరైన వ్యాయామం, పోషకాహారం దివ్య ఔషధాలని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అవి ప్రతిరోజూ మనిషి జీవితంలో భాగమైతే దృఢత్వంగా, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ మానసిక రుగ్మతలనేవి అనేక రూపాల్లో వెలుగుచూస్తుంటాయి. ప్రధానంగా మద్యం తాగే అలవాటున్నవారికి మానసిక రుగ్మతలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

● ఉమ్మడి విజయనగరం జిల్లాలో మద్యానికి బానిసై సగటున 600 మంది, కుంగుబాటుతో మరో 700 మంది, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి మరో 400 మంది వరకూ ప్రతినెలా ఆస్పత్రులకు వస్తుంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే కరోనా తరువాత ఇటువంటి రోగుల సంఖ్య పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అప్పట్లో ఇటువంటి వారు 100 నుంచి 200 మంది దాకా మాత్రమే ఉండేవారని వైద్య నిపుణులు తెలిపారు. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వ్యసనాలకు బానిస కావడం, కుటుంబ స్థితిగతులు దిగజారడం వంటివి మానసిక వ్యాధులకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

మానసిక రోగుల లక్షణాలు..

● ఒకే పనిని పలుమార్లు చేయడం.. కడిగింది మళ్లీ మళ్లీ కడగడం.. ఈ చర్యనే ఓసీడీ (ఆబ్సెస్సివ్ కంపల్సరీ డిజార్డర్) అంటారు. ● ఇంటికి తాళం వేశాక సరిగ్గా పడిందా? లేదా? అని అదే పనిగా చూసుకోవడం. ● మద్యం తాగి పిచ్చిగా వాగడం, మాదక ద్రవ్యాలకు బానిసై నేర ప్రవృత్తిని ఎంచుకోవడం. ● ఒక విషయాన్ని చూసి, విని, చదివి విపరీతంగా గాబరా పడడం, దీనినే హైపర్ టెన్షన్ కూడా అంటారు. ● అందరిలో నేనే గొప్ప అని చెప్పడం, అరవడం కూడా. ● చిన్నారుల్లో అయితే మొండిగా వ్యవహరించడం, కోపంగా చూడడం, అతిగా సెల్‌ఫోన్ వాడడం. ● పెద్ద వాళ్లలో అయితే అతిగా మతిమరుపు, లైంగిక సమస్యలతో మానసికంగా బాధపడడం.

లక్షణాలను గుర్తించాలి..

మానసిక వ్యాధిని నిర్దేశించలేం. మనిషిలో వచ్చిన మార్పులకు అనుగుణంగా అంచనా వేయాల్సి ఉంటుంది. దీనిని వాడుక భాషలో మతి భ్రమణం, పిచ్చి అని అంటుంటారు. నిర్ధారణకు ప్రత్యేకమైన పరీక్షలంటూ ఉండవు. వ్యక్తి ప్రవర్తనలో మార్పులు, దైనందిన జీవితంపై వీటి ప్రభావం ఎలా ఉంటుందన్న విషయాలను కుటుంబసభ్యులు గమనించి వైద్యసేవలు అందించాల్సి ఉంటుంది.

యోగాతో ఎంతో మేలు..

మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా మంచి చిట్కా. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో 45 నిమిషాల పాటు యోగా చేస్తే మంచి ఫలితం చూపుతుంది. సూర్యనమస్కారాలు, సూక్ష్మ వ్యాయామాలతో మానసిక ఒత్తిడి నుంచి దూరం కావొచ్చు. శ్వాసపై ధ్యాస పెట్టి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

-ధనుంజయ్‌రావు, యోగా శిక్షకుడు, విజయనగరం

ఒత్తిడికి దూరంగా ఉండాలి..

దేనికీ ఒత్తిడి పడకూడదు. మనిషి ఇటీవల బిజీ అవుతు న్నాడు. తెల్లవారులే చింది మొదలు బతుకు పోరాటం సాగి స్తున్నాడు. ఇటువంటి సమయంలో విశ్రాంతి కరువు అవుతోంది. అది శరీరంపై ప్రభావం చూపుతోంది. అందుకే వీలై నంత వరకూ ప్రశాంతతను అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా వ్యాయామం, సరైన ఆహారం తీసుకోవడం చాలా ఉత్తమం.

-డాక్టర్ సూర్యనారాయణ, మానసిక వైద్య నిపుణుడు, విజయనగరం

నలుగురిలో ఒకరికి మానసిక రుగ్మత..



సమాజంలో ప్రతి నలుగురిలో ఒకరు చొప్పున మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. దీనికి కారణం అవగాహనా రాహిత్యమే. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ఆత్మహత్య నివారణపై దృష్టి పెట్టి ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్దేశించింది. ప్రస్తుత విద్యావిధానం, తీవ్ర ఒత్తిడితో కూడిన దైనందిన జీవితం, కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం, ఆహారపు అలవాట్లు ఇలా పలు అంశాలు మానసిక ఒత్తిడికి కారణమవుతున్నాయి. బొబ్బిలి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో జిల్లా మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ కింద ఐదేళ్ల క్రితం వరకు ప్రతి నెలా రెండో మంగళవారం కౌన్సిలింగ్ సెంటరును నిర్వహించేవారు. ఇప్పుడు దాన్ని తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఉంది. వ్యసనాల నుంచి విముక్తి కలిగించాలని వస్తున్న రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

-డాక్టర్ జాగారపు రమేష్, మానసిక వైద్యనిపుణుడు

సచివాలయ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జగన్‌పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, పంచాయతీ కార్యాలయాలకు విద్యుత్ బిల్లులు కూడా చెల్లించకుండా పాలించిన ఘనత వైసీపీకే దక్కుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునతో కలిసి ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వర్యం చేస్తుందన్న చిన్నశ్రీను వ్యాఖ్యలను ఆయన కొట్టిపడేశారు. అభివృద్ధి అంటే డివైడర్లకు రంగులు వెయ్యటం కాదని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవన ప్రమాణాలని పెంచాలని, జిల్లాలో రూ 942 కోట్లతో ఇప్పటికే అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయన్నారు.

● బొత్స సత్యానారాయణ జిల్లాను విడిచి, పొరుగు జిల్లాలో రాజకీయాలు చేస్తున్నారని, ఆ చోటు భర్తీచేసుకుని, తన ఉనికిని కాపాడుకోవటానికే ఈ మధ్య కాలంలో చిన్న శ్రీను ప్రెస్ ముందుకు ఎక్కువగా వస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం మీదే దృష్టి సారిస్తుందని, ఇలాంటి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. మాజీ జడ్పీటీసీ, సీనియర్ టీడీపీ నాయకులు మక్కువ శ్రీధర్, గంట్యాడ మండల పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాస్కర్‌నాయుడు, నగర టీడీపీ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సభలో ఉండొద్దు..

● ఆలస్యంగా వచ్చిన వైద్యురాలిని బయటకు పంపించేసిన ఎంపీపీ

● వాడీవేడిగా ఎస్.కోట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సండిసోమేశ్వరరావు

శృంగవరపుకోట: సభలో ఉండొద్దని చెప్పినా ఎందుకొచ్చి కూర్చున్నారు.. ఎంపీపీ అన్నా, సభన్నా మీకు గౌరవం లేదా? అంటూ బుధవారం జరిగిన శృంగవరపుకోట సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సండిసోమేశ్వరరావు కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిని ప్రశ్నించారు. ఆలస్యంగా వచ్చినందుకు సభలో అందరి ముందు నిలబెట్టి అడగడంతో వైద్యురాలు కంటతడి పెడుతూ బయటకు వెళ్లిపోయారు. వివిధ శాఖల అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన క్రీడా సంబరాల మీటింగ్‌లో ముందు కూర్చోవలసిన పాఠశాల చైర్మన్‌ను వెనక్కి కూర్చోబెట్టి ఏ అధికారంలేని రాజకీయ నాయకులకు సభా ప్రాంగణంపై ఎలా కూర్చోబెట్టారని మండల విద్యాశాఖాధికారులు నర్సింగరావు, పి.గణపతిని నిలదీశారు. వసి గ్రామ వీవోఏను ఎందుకు తొలగించారో చెప్పాలని వెలుగు ఏపీఎం వై.రమణను డిమాండ్ చేశారు. నాలుగు రోజుల్లో దీనిపై సమాధానం చెప్పాలని ఎంపీపీ అనడంతో ఏపీఎం నెలరోజులు గడువు అడిగారు. ముషిడిపల్లి గ్రామంలో డి.పట్టా, చెరువు భూముల్లో రోడ్డు నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోలేదని, జిందాల్‌కు ఇచ్చిన భూముల్లో ఓ లేవుట్‌కు ఉపయోగపడేలా రోడ్డు నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వైస్ ఎంపీపీ సుధారాజు వ్యాఖ్యానించారు. అలుగుబిల్లి ఎంపీటీసీ రాయవరపు చంద్రశేఖర్, కృష్ణాపురం సర్పంచ్ యామిని , శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషికుమారి పలు విషయాలపై అధికారులను నిలదీశారు. 104 పనులకు రూ.5.13 కోట్లు ఉపాధి నిధులు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ శాఖ ఏఈ సత్యనారాయణ సభకు వివరించారు. సభ దృష్టికి తెచ్చారు. వ్యవసాయ శాఖ, ఉపాధి హమీ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఎంపీడీవో సతీష్ ఉన్నారు.

ఇబ్బందులు రాకుండా ఉత్సవాలు నిర్వహిస్తాం

● 'డయల్ యువర్ ఎంపీ'లో కలిశెట్టి ప్రజాభిప్రాయ సేకరణ

విజయనగరం(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ పండగ నిర్వహణపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఫోన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇందుకు సంబంధించి బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి సాయంత్రం 6వరకు విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ ఎంపీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన పలు సూచనలు, సలహాలు రికార్డు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా అధికార పండగలా గుర్తించి ఉత్సవాలు, సిరిమానోత్సవానికి నిధులు మంజూరు చేయటం ఆనందకరమన్నారు. అనంతరం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి ప్రజాభిప్రాయాలను వారికి వివరించారు.


అగ్నిమాపక కేంద్రాల ఆధునికీకరణకు నిధులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

కొత్తవలస: రాష్ట్రంలోని అన్ని అగ్నిమాపక కేంద్రాలను ఆధునికీకరించడం కోసం రాష్ట్రప్రభుత్వం 252 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని ఉత్తర ప్రాంతానికి చెందిన అడిషనల్ డైరక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కొత్తవలసలో నున్న అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు దాటిన అగ్నిమాపక శకటాలను మారుస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం కొత్తగా 110 కొత్తవ వాహనాలు సమకూర్చడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని రికార్డులను పరిశీలన చేశారు. అగ్నిమాపక శకటం కండీషన్‌లో ఉందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. డి. నిరంజన్ రెడ్డి, బీవీఎస్ రాంప్రకాష్, కొత్తవలస కేంద్రం అధికారి అశోక్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

బాడంగి: స్థానిక పోలీసు స్టేషన్‌ను బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిబ్బందితో కవాతు నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. ట్రాఫిక్ చట్టాలు, మైనర్లకు వాహనాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. చట్టాలపై ప్రజలకు కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు.

గంజాయి కేసులో ఎనిమిది మంది అరెస్టు

● ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడి

నెల్లిమర్ల: నెల్లిమర్ల చంపావతి నది పక్కన గల బహిరంగ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్న 8 మంది నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 8 కిలోల గంజాయిని నెల్లిమర్ల పోలీసులు రికవరీ చేసినట్టు ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. విజయనగరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నెల్లిమర్ల నుంచి రామతీర్థం వెళ్లే రోడ్డు పక్కన చంపావతి నది తీరంలో ఉన్న బహిరంగ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగుర్ని, గంజాయి సేవిస్తున్న మరో ఇద్దరిని నెల్లిమర్ల పోలీసులు అదుపులోనికి తీసుకుని విచారణ చేసినట్టు చెప్పారు. వారి వద్ద నుంచి 8 కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరంతా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులుగా గుర్తించారు. నిందితుల్లో ఒకరు పరారయినట్టు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

రాజాం: మున్సిపాలటీ పరిధిలోని డోలపేటలో కన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జెమ్స్ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 310 మంది రోగులకు తనిఖీలు చేశారు. మందులు ఉచితంగా అందజేశారు. కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

రైలు కింద పడి 40 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

కొత్తవలస: రైలు ఢీకొని గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతలపాలెం గ్రామానికి మురుగుటి కృష్ణ, మురుగుటి రాజు మంగళవారం ఉదయం తమ గొర్రెల మందను మేతకు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మంగళవారం సాయంత్రం రైల్వే ట్రాక్ దాటుతుండగా పెందుర్తి వైపు నుంచి కొత్తవలస వస్తున్న రైలు ఢీకొట్టింది. పెందుర్తి మండలం జంగాలపాలెం, కొత్తవలస మండలం చింతలపాలెం సరిహద్దులో జరిగిన ఈ ఘటనలో 40 వరకు గొర్రెలు చెల్లాచెదురుగా పడి మృతి చెందాయి. ఘటన జరిగిన ప్రాంతం అంతా తుప్పలు, డొంకలతో నిండి ఉండడంతో బుధవారం ఉదయం మృతి చెందిన గొర్రెలను అక్కడినుంచి తొలగించారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ. 5 లక్షల వరకూ ఉంటుందని అంచనా. రైలుకింద పడిపోయిన గొర్రెలకు ఎటువంటి ఇన్‌స్యూరెన్స్ ఉండదని గొర్రెల మంద యజమానుల బంధువు చింతలపాలెం మాజీ సర్పంచ్ భీష్మ తెలిపారు. చింతలపాలెం సర్పంచ్ విషయాన్ని స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారికి సమాచారం ఇవ్వడంతో నష్ట పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు

మహిళ ఆత్మహత్య


గంట్యాడ: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేమలి గ్రామానికి చెందిన ఊడిగల కుమారి (34) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీనికి చికిత్స పొందుతున్నప్పటికీ ఫలితం లేకపోయింది. ఇటీవల నొప్పి తీవ్రం కావడంతో భరించలేక బుధవారం ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించేటప్పటికి మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈమెకు భర్త చిన్న, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

రేగిడి: పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో నాయిరాలవలస గ్రామానికి చెందిన రుంకు దుర్గారావు(55) వ్యవసాయం చేసుకుంటూ, రైతు కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం గడ్డికోసేందుకు గ్రామానికి దగ్గరలో ఉన్న పొలానికి వెళ్లాడు. అక్కడ ఏదో విష సర్పం కాటువేయడంతో కాళ్లకు తాడు కట్టి గ్రామానికి నడిచి వస్తుండగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే బూరాడ పీహెచ్‌సీకి, రాజాం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈయనకు భార్య నారాయణమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మద్యం సీసాల పట్టివేత

బొబ్బిలి అక్టోబరు 9: బొబ్బిలి పట్టణ పరిధిలో గొల్లవీధి జంక్షన్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 9 వేల రూపాయల విలువ చేసే 60 మద్యం సీసాలను బుధవారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్ఐ ఆర్.రమేష్ తెలిపారు. సమాచారం తెలియగానే సీఐ కటకం సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నిఘా వేసి రంగరాయపురం గ్రామానికి చెందిన వంగపండు తవిటినాయుడును మద్యంతో సహా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. మద్యం సీసాలను సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


సాలూరు రూరల్: సరస్వతిగా సంతోషిమాత

సరస్వతీదేవికి పూజలు

- కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- చదువులతల్లిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ
- ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గమ్మతల్లి సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలల్లో సరస్వతీదేవి పూజలు నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


బెలగాం: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర


భామిని: సరస్వతీదేవికి పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు


పాలకొండ: కోటదుర్గమ్మ ఆలయంలో అక్షరాభ్యాసాలు


సీతంపేట రూరల్: సంతోషిమాత దేవాలయంలో..


మక్కువ: పోలమాంబ ఉత్సవ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


వీరఘట్టం: దుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

- పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయా లని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ప్రజలకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్నును రద్దు చేసిందని చెప్పారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఎక్కడైనా సమస్యలతో పాటు ఫిర్యాదులు వస్తే అధికారులు వెంటనే స్పందించాలని ఆయన ఆదేశించారు.

అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీలకు పైడిరాజు


పైడిరాజు

సాలూరు రూరల్: మలేషియాలో ఈనెల 10 నుంచి 19 వరకు జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో మామిడిపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారిణి కనకల పైడిరాజు పాల్గొననున్నారు. ఈ విషయమై ఆమె కోచ్ పొట్నూరు శ్రీరాములు బుధవారం వెల్లడించారు. ఆమె ఇటీవల శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభా చాటారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో 200, 400, 800 మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటి స్వర్ణ పతకాలను కైవశం చేసుకున్నారు. మలేషియా బుకిత్‌లో జలిల్ స్టేడియంలో జరగనున్న 36వ అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొంటున్నారు. ఆమె ప్రస్తుతం విశాఖ గీతం డెంటల్ కళాశాలలో ఏఎన్ఎంగా పనిచేస్తున్నారు. ఇద్దరు పిల్లలకు తల్లిగా బాధ్యతలు మోస్తూనే క్రీడలపై మమకారంతో రోజూ సాధన చేస్తున్నారు.

మద్యంషాపులకు దరఖాస్తు చేసుకోండి

సాలూరు రూరల్: మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 11 వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్టు సాలూరు ఎక్సైజ్ సీఐ గులిపిల్లి దాసు చెప్పారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి తొలుత బుధవారంతో గడువు ముగియాల్సి ఉందన్నారు. అయితే పలువురి నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ గడువును మరో రెండు రోజులు పొడిగించిందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 11 సాయంత్రం ఏడు గంటల వరకు గడువు ఉందని ఆయన తెలిపారు. తదుపరి వచ్చిన దరఖాస్తులను 12, 13 తేదీల్లో పరిశీలించనున్నామని చెప్పారు. ఉన్నతాధికారుల సమక్షంలో ఈనెల 14న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు ఉంటుందని తెలిపారు. అదే రోజు ఎవరికి షాపు వచ్చిందో సమాచారం ఇస్తామన్నారు. షాపు వచ్చిన వారు ఈనెల 16 నుంచి మద్యం విక్రయాలు చేయాల్సి ఉందన్నారు.

ఉద్యోగాల భర్తీ ఎప్పుడు?

సాలూరు రూరల్: ఉద్యోగాల భర్తీ ఎప్పుడని నిరుద్యోగులు, యువత పక్షాన ప్రశ్నిస్తున్నట్టు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర తెలిపారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం గ్రూప్ వన్ ఉద్యోగాలకు 2022లో నోటిఫికేషన్ ఇచ్చి 2023లో భర్తీ చేసిందన్నారు. అదే విధంగా 2023 డిసెంబరులో గ్రూప్ వన్, టూ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ప్రిలిమ్స్ పరీక్షలను నిర్వహించి ఫలితాలను ప్రకటించామని చెప్పారు. మెయిన్స్ ఎగ్జామ్స్ ఈ ఏడాది జూలై, సెప్టెంబరులో జరగాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చి వాటిని వాయిదా వేసిందన్నారు. డీఎస్సీకి కూడా తమ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా దానిని కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కొత్తగా 16,347 పోస్టులతో డీఎస్సీ అంటూ తొలి సంతకం చేశారన్నారు. ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నించారు. అటవీ శాఖలో 600 ఉద్యోగాల కోసం తామిచ్చిన నోటిఫికేషన్ సంగతేమిటన్నారు.

ఘనంగా నీలమ్మతల్లి ఉత్సవాలు

కురుపాం రూరల్: గిరిజనుల ఆరాధ్య దైవం అంగరాడ నీలమ్మతల్లి ఉత్సవాలను రస్తాకుంటుబాయి గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మూడో రోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి మొక్కులు చెల్లించి, భక్తులకు అన్న ప్రసాదాలు పంచిపెట్టారు.


అంగరాడ నీలమ్మకు మొక్కులు చెల్లిస్తున్న దృశ్యం

సాలూరు పట్టణాభివృద్ధికి సహకరించాలి

సాలూరు రూరల్: సాలూరు పట్టణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహకరించాలని వైసీపీ నుంచి ఇటీవల జనసేనలో కలిసిన అర్బన్‌బ్యాంక్ అధ్యక్షుడు జరజాపు ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ జరజాపు సూర్యనారాయణ, కౌన్సిలర్ వరప్రసాద్ తదితరులు కోరారు. వారంతా బుధవారం సాలూరులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్‌ను కలిశారు. గొర్లె తిరుపతినాయుడు(జీటీ) పాల్గొన్నారు.

ఫర్నీచర్ ఎవరు దొంగలించారో తేల్చండి

సాలూరు రూరల్: సాలూరు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోని విలువైన ఫర్నీచర్‌ను ఎవరు దొంగలించారో అధికారులు తేల్చాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో బుధవారం సాలూరులో ధర్నా చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజీవ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో బీజేపీ సంబరాలు

బెలగాం: ఇటీవల జరిగిన ఎన్నికల్లో హర్యానాలో బీజేపీ విజయకేతనం ఎగురవేసిన సందర్భంగా పార్వతీపురంలోని జిల్లా కార్యాలయం వద్ద బుధవారం ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఒకరికి ఒకరు కరచాలనం చేసుకుని స్వీట్లు పంచుకున్నారు.

కేంద్ర బృందం పర్యటన

పాచిపెంట: మండలంలోని పద్మాపురం, మిర్తివలస గ్రామాల్లో బుధవారం జాతీయ మోనటరింగ్ బృందం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులను కేజీ సలీమ్‌కుమార్, ఎంకే శశిఅప్పన్‌లతో కూడిన బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఉపాధి హామీ పథకం, పీఎం కిసాన్, హౌసింగ్, పింఛన్లు, భూసర్వే, జల జీవన్ మిషన్, పంచాయతీకి మంజూరు చేసిన నిధులు వినియోగంపై రికార్డులు పరిశీలిస్తూ గ్రావెల్ రహదారులు, ఉద్యానవన శాఖకు చెందిన మొక్కలను పరిశీలించారు. ఈ పర్యటనలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఇన్‌చార్జి ఉపాధి హామీ ఏపీడీ రమేష్‌రామ్, స్థానిక మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నసమారాధన

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిరిడీ సాయి బాబా ఆలయంలో బుధవారం గర్భిణులకు అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి నెల 9వ తేదీన తనిఖీలు నిమిత్తం పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులు తిరిగి ఇంటికి వెళ్లేసరికి మధ్యాహ్నం మూడు గంటలవుతోంది. ఈ విషయం తెలుసుకున్న బురదవెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స శివున్నాయుడు, గౌరమ్మ, బొత్స శ్రీహరిరావు, ఇంద్రాణి దంపతులు ముందుకు వచ్చి, బుధవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయి దేవ సంస్థానం వీరికి సహకరిస్తోంది.

ఏనుగుల సంచారం

సీతానగరం: మండలంలోని తాన్న సీతారాంపురం, గుచ్చిమి గ్రామ సమీపంలోని నీలగిరి తోటలు, కొండల ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. వరి పొలాల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ప్రత్యేక పర్యవేక్షణ అధికారి మణికంఠేష్ నేతృత్వంలో పర్యవేక్షణ చర్యలు చేస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లించాలి

బెలగాం: పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వో కేశవనాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దృష్టికి పీహెచ్‌సీ భవన సమస్య

సాలూరు రూరల్/మక్కువ: శంబర పీహెచ్‌సీలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని రోగులకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు హామీనిచ్చారు. మక్కువ మండలం, శంబర పీహెచ్‌సీని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మందుల నిల్వ, రక్తహీనత, అవుట్ పేషెంట్ సేవలు, విషజ్వరాలు తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. సత్యసాయి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న ఉచిత భోజనాన్ని పరిశీలించి, స్వయంగా వడ్డించారు. మాతృవియోగం పొందిన టీడీపీ నాయకుడు అక్యాన తిరుపతిరావును పరామర్శించారు. శంబర పోలమాంబను దర్శించుకున్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

మక్కువ: స్థానిక సచివాలయంలో పోలమాంబ స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ ఎన్నికలను బుధవారం నిర్వహించారు. పాలకవర్గం సభ్యులుగా తాతపూడి సత్యనారాయణ, బోరబంద శివుడు, రౌతు సింహాచలం, దుర్గాడ తిరుపతి, మామిడి సూరన్నదొర, మరడాన రాము, మరకంట జగన్నాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులకు ఎన్నికల అధికారి పి.రమాదేవి ధ్రువపత్రాన్ని జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

వీరఘట్టం: అడారు గ్రామంలో ఇటీవల యోగిదొర అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముచ్చపాటి హరి, ముచ్చపాటి భానులపై అట్రాసిటీ కేసు నమోదయ్యింది. ఈ మేరకు బుధవారం పాలకొండ డీఎస్పీ రాంబాబు ఆ గ్రామాన్ని సందర్శించి, దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ కళానిధి ఉన్నారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

బలిజిపేట: వంతరాం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులకు (పొరుగు సేవల ప్రాతిపదికన) ఈనెల 15వ తేదీలోగా అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని బలిజిపేట ఎంఈవో-1 సామల సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో చౌకీదార్ 1, హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 1 మొత్తం మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నియామకాలకు వయో పరిమితి ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు 42 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు 47 సంవత్సరాలు, దివ్యాంగులకు 52 ఏళ్ల వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 15వ తేదీనాటికి ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

ఏకలవ్య పాఠశాలలో గెస్ట్ టీచర్ పోస్టుకు..

బెలగాం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని అనసభద్ర ఏకలవ్య రెసిడెన్సియల్ స్కూల్లో టీజీటీ తెలుగు సబ్జెక్టు బోధనకు గెస్ట్ టీచర్ ప్రాతిపదికన పని చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఆసక్తిగల అభ్యర్థులు, రిటైర్డ్ టీచర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానం కోరడమైనదని అన్నారు.